

# భూములు అప్పగించే వరకు

# నిరంతర పోరాటం

## రెండో రోజు కొనసాగిన ఆదివాసీల ఆందోళన

**అశ్వారావుపేట-నవభూమి :** తమ భూములు సర్వే చేసి అప్పగించే వరకు నిరవధిక నిరాహార దీక్ష విరమించేది లేదని ఆదివాసులు స్పష్టం చేశారు. అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీలు సర్వేనెంబర్ 30, 36, 39 లలో రెవిన్యూ శాఖ తమకు పట్టాలి ఇచ్చిన భూమిని అటవీ శాఖ అధికారులు ఆక్రమించుకున్నారని, వెంటనే వాటిని అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు అశ్వరావుపేట తాసిల్దార్, అటవీశాఖ కార్యాలయల ఎదుట చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజు చేరాయి. ఈ సందర్భంగా ఆదివాసీలు నల్ల రిబ్బన్లతో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

కొన్నేళ్లుగా భూముల కోసం ఉద్యమాలు చేస్తున్నామని అయినా అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆదివాసీ నాయకులు మనకు నాగేశ్వరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే హైకోర్టు, జిల్లా కలెక్టర్ భూములు సర్వే చేసి అప్పగించాలని ఆదేశించిన అధికారులలో చలనం కనిపించడం లేదని మండిపడ్డారు. గతంలో పాదయాత్ర చేపట్టినప్పుడు అధికారులు భూములు అప్పగిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కొన్ని నెలలపాటు వేచి చూసిన అధికారులు సమస్య పరిష్కరించటం లేదని, దీనిపై మరోసారి ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుని ఈనెల 5వ తేదీని అధికారులకు వినతి పత్రం ఇచ్చామని వివరించారు. 8వ తారీకు దాకా గడువు ఇచ్చామని, 9వ తేదీన సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళన చేపడతామని వినతి పత్రంలో స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. అధికారుల నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో మా భూముల కోసం నిరోధక నిరాహారదీక్ష చేపట్టినట్లు తెలిపారు.

# రామాలయంలో

# జ్యేష్ఠాభిషేకం ఉత్సవాలు

## ఉత్సవాలకు సంబంధించి ఆలయ అధికారులు అంకురార్పణ


**భద్రాచలం-నవభూమిప్రతినిధి**


భద్రాచలం రామాలయంలో మంగళవారం నుంచి జ్యేష్ఠాభిషేకం ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఈ రోజు అంకురార్పణ జరగనుంది. ఈ సందర్భంగా బుధవారం అభిషేకం కార్యక్రమంతో రామయ్య నిత్య కళ్యాణం కార్యక్రమాన్ని ఆలయ అధికారులు నిలిపివేయనున్నారు. కాగా వేసవి సెలవులు ముగియనుండడంతో శని, ఆదివారాలు శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణమంతా శ్రీరామ నామస్మరణలతో మారుమోగింది. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూ లైన్లలో వేచి ఉన్నారు.

సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ప్రధాన ఆలయంలోని లక్ష్మణ సమేత సీతారాముల మూలమూర్తులకు ఆలయ అర్చకులు బంగారు తులసీదళాలతో అర్చన చేశారు. భక్తులు భారీగా తరలి రావడంతో ఉచిత దర్శనానికి 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పడుతోంది.



నవభూమి

జిల్లా అనుబంధం

11 జూన్ ,2025 బుధవారం పేజీలు:7

www.epaper.navabhoomi.in


# ఆకట్టుకున్న

# సెల్ఫీ విత్ చైల్డ్

## అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభ వేడుకలు ఆకట్టుకున్న సెల్ఫీ విత్ చైల్డ్

**ఖమ్మం-నవభూమి :** అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభ వేడుకలు ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం సంబురంగా జరిగాయి. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ఐసీడీఎస్ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వేడుకలు జరగడంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గుర్రాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన వేడుకకు జిల్లా సంక్షేమ అధికారి రామ్ గోపాల్ రెడ్డి, ఐసీడీఎస్ ఖమ్మం రూరల్ ప్రాజెక్టు అధికారి కమల ప్రియ హాజరయ్యారు.




ఈ సందర్భంగా కేంద్రానికి నూతనంగా వచ్చిన పిల్లలకు అధికారులు స్వాగతం పలికారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అమల్లోకి రాబోతున్న ఎగ్ బిర్యాని వంటకం రుచి చూపించారు. ఆటపాటలతో కూడిన బోధన అంశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అంగన్‌వాడీ కేంద్రంలో సెల్ఫీ విత్ చైల్డ్ ప్రోగ్రాంలో భాగంగా చిన్నారులతో సరదాగా సెల్ఫీలు దిగారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి పిల్లల తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, హెల్పర్ నీలిమ, గ్రామస్తులు పాల్గొన్నారు.



# యోగా సాధన ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చు

### టిఎన్జిఓ నేత జయపాల్






**తిరుమలాయపాలెం నవభూమి జూన్ 10** యోగ ద్వారా ప్రతి ఒక్కరు మానసిక ప్రశాంతత పొందవచ్చని టీఎన్జీవో నాయకులు జెడ్ఎస్ జైపాల్ అన్నారు మంగళవారం 11వ అంతర్జాతీయ యోగా డే దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 13 వ రోజు ఆయుర్వేదిక్ వైద్యాశాల ఆధ్వర్యంలో ఖమ్మం బస్ స్టాండ్ నందు యోగా నిర్వహించారు ఈ సందర్భంగా టీఎన్జీవో రాష్ట్ర నాయకులు జైపాల్ మాట్లాడుతూ యోగ సాధన ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చు అని అన్నారు ప్రతి ఒక్కరూ యోగాను తప్పనిసరిగా చేయాలని సూచించారు యోగా చేయటం వల్ల మనిషి ఎంతో దృఢంగా నిలబడతాడని యోగ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. బస్టాండ్ మేనేజర్ జి. రాఘు బాబు, కంట్రోలర్ సిహెచ్. వెంకటేశ్వర్లు తదుపరి ఖమ్మం ఆయుర్వేదిక్ వైద్యాశాల నందు సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి.దశరథ్, మొక్కలు నాటారు ఈ కార్యక్రమములో ఫార్మసిస్ట్ యస్. ప్రకాష్, ఎం ఎన్ ఓ పి. క్రాంతికుమార్ టీఎన్జీవో నాయకులు జడ్.ఎస్. జయపాల్, కొప్పుల దిలీప్ యోగా శిక్షకులు టి .ప్రసన్న, ఎన్. శ్రీకాంత్, బి.సురేష్ పాల్గొని విజయవంతం చేసారు

# ఆదివాసీ హెల్ప్ లైన్ వారిది గొప్ప మనసు

### డయాలసిస్ చికిత్సకై తాటి మంజీరాకు రూ.40 వేల ఆర్థిక సహాయం

**ఇల్లెందు జూన్ 10 నవభూమి ప్రతినిధి:** ఆదివాసీ హక్కుల ఉద్యమ నేత తాటి రామారావు కుమార్తె మంజీరా కిడ్నీ సంబంధిత వ్యాధి డయాలసిస్ చికిత్స కోసం ఆదివాసీ హెల్ప్ లైన్ ఇల్లందు వారు ఆదివాసీ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సహకారంతో రూ.40 వేల ఆర్థిక సహాయం హెల్ప్ లైన్ కార్యాలయం ఇల్లందులో వారి తండ్రి కి అందజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ హక్కుల ఉద్యమ నేత తాటి రామారావు కుమార్తె తాటి మంజీరా వయస్సు 13 సంవత్సరాలు, 8వ తరగతి చదువుతున్నది. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ పంజాగుట్ట నిమ్స్ హైదరాబాదులో చికిత్స పొందుతున్నది.ప్రస్తుతం ఆరోగ్యం విషమించడంతో రెండు కిడ్నీలు పని విధానం క్షీణించడంతో నిమ్స్ దవాఖానలో డయాలసిస్ చికిత్స చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆదివాసీ హెల్ప్ లైన్ ఇల్లందు వారు ఆదివాసీ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సహకారంతో డబ్బులు సేకరించి మంజీరా ఆరోగ్య ఖర్చుల కోసం అందజేశారు.సహకరించిన దాతలు ప్రతి ఒక్కరికీ ఆదివాసీ హెల్ప్ లైన్ ఇల్లందు తరుపున హృదయపూర్వక ధ్యవాదములు తెలిపారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో ఆదివాసీ హెల్ప్ లైన్ వ్యవస్థాపకులు కబ్బాకుల రవి, హెల్ప్ లైన్ ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణ, సంయుక్త కార్యదర్శులు కొడెం కృష్ణ, కల్తి రాంబాబు, కార్యదర్శి కొర్సా ఆదినారాయణ, గలిగ రాంబాబు, సభ్యులు బొర్రా రాంబాబు తదితరులు ఉన్నారు.



### బూర్గంపాడు మండల సేవాలాల్ సేన

# నూతన కమిటీ ఎన్నిక

- ముఖ్యఅతిథిగా హాజరైన సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ బాణావత్ హుస్సేన్ నాయక్



**బూర్గంపాడు జూన్ 10 నవభూమి ప్రతినిధి:** బూర్గంపాడు మండల పరిధిలో సేవాలాల్ సేన కమిటీ ఆధ్వర్యంలో సారపాక పట్టణంలో సేవలాల్ సేన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సేవలాల్ సేవ రాష్ట్ర కో కన్వీనర్ బాణావత్ హుస్సేన్ నాయక్ హాజరైనారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఎన్నిక చేయడం జరిగింది. హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ గిరిజనల యొక్క ఆరాధ్య దైవం సేవాలాల్ యొక్క కృషి, శ్రమ గిరిజన ప్రజల కోసం అయన చేసిన త్యాగం గిరిజన తండాలకు మరియు ప్రజలందరికీ తెలియజేయాలని సేవాలాల్ యొక్క ఆశయాల కొరకు ప్రతి ఒక్కరూ బాధ్యత కలిగి పనిచేసే వారిగా నెరవేర్చే వారిగా ఉండాలని హుస్సేన్ నాయక్ తెలియజేశారు.నూతన మండల అధ్యక్షుడిగా గుగులోతు రాంబాబు నాయక్ (సారపాక), మండల వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా సురేష్ నాయక్ (సారపాక), మండల ప్రధాన కార్యదర్శి భూక్య వీరబాబు (కృష్ణ సాగర్ ), మండల అధికార ప్రతినిధి బాణావత్ రత్నా కుమార్ నాయక్ (అంజనాపురం ), ప్రచార కార్యదర్శి బుక్యా నరేష్ నాయక్ (ఉప్పుసాక), సారపాక సేవలాల్ సేన టౌన్ కమిటీ, సారపాక టౌన్ అధ్యక్షులు ఆంగోతు రఘు( గాంధీనగర్), ప్రధాన కార్యదర్శి గూగులోత్ శంకర్ (రాజీవ్ నగర్), ఉపాధ్యక్షులు బాధావత నాగరాజు( భాస్కర్ నగర్), కార్యదర్శి బానోత్ రంగా (భాస్కర్ నగర్), ప్రచార కార్యదర్శి లాకావత హరిలాల్ (విజయనగరం),సారపాక టౌన్ యూత్ కమిటీ యూత్ అధ్యక్షులు భూక్య వినోద్ కుమార్( రాజీవ్ నగర్), ప్రధాన కార్యదర్శి బుక్య బిక్షం (గాంధీనగర్) ఉపాధ్యక్షులు, గుగులోత్ గణేష్ (ముత్యాలమ్మ పేట) బూర్గంపాడు మండల కమిటీ సలహాదారు, అజ్మీర రాంజీ ( గాంధీనగర్), ధరావత్ రాములు, (భాస్కర్ నగర్), లోక్య (కృష్ణ సాగర్), ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవలాల్ సేన జిల్లా ప్రచార కార్యదర్శి ధరావత్ రాంబాబు నాయక్, సేవాలాల్ సేన కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన మండల నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ మండల%శీ% లో గిరిజన సమస్యలపై పోరాడుతామని మాపై నమ్మకంతో ఇచ్చిన సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ బాణావత్ హుస్సేన్ నాయక్ కి బంజారా ఫైర్ బ్రాండ్ సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

# నకిలీ విత్తనాలను అరికట్టాలి

- వ్యవసాయ కూలీలకు సమగ్ర వేతన చట్టాన్ని అమలు చేయాలి
- అఖిల భారత ఐక్య రైతు సంఘం ( ఏఐయుకేఎస్) డిమాండ్

**పాల్వంచ టౌన్ జూన్ 10 నవభూమి ప్రతినిధి:** అఖిల భారత ఐక్య రైతు సంఘం ( ఏఐయుకేఎస్) పాల్వంచ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పాల్వంచ మండల తహసిల్దార్ కి వివిధ డిమాండ్లతో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం ( ఏఐయుకేఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరి కిషోర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్రంలో ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు విత్తనాలు పురుగుమందులు వ్యవసాయ పరికరాలు, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, పాత రుణాలు మాఫీ చేయాలని, రైతు భరోసా కౌలు, పోడు భూములకు, కూడా అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.అదేవిధంగా గత సీజన్ నాటి పెండింగ్ సన్న ధాన్యం బోనస్‌ను వెంటనే చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీసం మద్దతు ధరలు నిర్ణయించి, ఎం ఎస్ పి, చట్టబద్ధత కల్పించాలన్నారు. సమగ్ర పంటల బీమా చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని, రైతులందరికీ సరిపడినన్ని విత్తనాలు ఎరువులు సకాలములో ఇవ్వాలన్నారు. ఎస్సీ ఎస్టీ లకు సబ్సిడీల ద్వారా ఉచితంగా సరఫరా చేయాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చిన వెంటనే రైతులందరికీ రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తానని, అధికారాంలోకి వచ్చి ఇప్పటికీ 18 నెలలు కావస్తున్న రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ అసంపూర్తిగా చేశారన్నారు. తక్షణమే రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేసి, కొత్త రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేయడం జరిగింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు రైతులందరికీ రైతు భరోసా ఇప్పటికి వేయలేదని వెంటనే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని నకిలీ విత్తనాలతో రైతులకు మోసం చేసే కంపెనీలు నకిలీ విత్తనాలు ఎరువులు విక్రయించే వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం ( ఏఐయుకేఎస్) జిల్లా నాయకులు రాయబారం వెంకటేశ్వర్లు, నకిరికంటి నాగేశ్వరరావు, యర్రగొర్ల రామారావు, టి యు సి ఐ జిల్లా నాయకులు, వేల్పుల రమేష్, గోనెల రమేష్, కుంజా భాస్కర్ మడకం ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.






## విత్తన షాపులను తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్ ఏడిఏ




**టేకులపల్లి జూన్ 10 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం టాస్క్ ఫోర్స్ డివిజనల్ ఏడిఏ యు. నరసింహారావు మంగళవారం టేకులపల్లి మండలంలో పర్యటించి పలు విత్తన షాపులను తనిఖీ చేశారు. అందులో భాగంగా టేకులపల్లి, కోయగూడెం గ్రామాల్లోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ధరల పట్టిక, స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్, బిల్లు బుక్, కంపెనీ పెర్మిషన్ లెటర్ ను పరిశీలించడం జరిగింది. అలాగే బిల్లుపై కచ్చితంగా రైతు సంతకం, డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలని, రైతులు పంట కాలం ముగిసేయంతవరకు బిల్లులను భద్రపరుచుకోవాలని సూచనలు చేశారు. ఆయన వెంట స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ ఉన్నారు.

## గూడు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహం

### బిఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నిరంతరం

### బికాంగ్రెస్ నేత రామ సహాయం నరేష్ రెడ్డి

**తిరుమలాయపాలెం నవభూమి జూన్ 10** గూడు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహం మంజూరు అవుతుందని ఎవరు అధైర్య పడవద్దని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి అన్నారు మంగళవారం మండల పరిధిలోని ముజాహిద్ పురం బడి తండా లక్ష్మీదేవి పల్లి తండా గ్రామాలలో ఆయన ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు ఈ సందర్భంగా ఇందిరమ్మ గృహ లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ గృహాలు మంజూరు కాని వారు అధైర్య పడవద్దని ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఇంటికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు గత పాలకులు, పక్క ఇండ్ల నిర్మాణాన్ని విస్మరించారని ఆరోపించారు ప్రజా ప్రభుత్వంలో ప్రజాసమక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు ప్రతి ఒక్కరూ మంజూరైన ఇందిరమ్మ గృహాన్ని తొలుత గతిన నిర్మించుకోవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుమన్ రెడ్డి వెంకటనారాయణ ఓ రా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు






### యువకులంతా ఆటల్లో

# పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

### సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు







**ఏనుకూరు,నవభూమి, జూన్ 10 :** యువకులంతా ఆటల్లో ఓడిపోయిన గెలిచిన పోటీ తత్వాన్ని అలవర్చుకొని వారి యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఖమ్మం లోని ఆద్య హాస్పిటల్ ప్రముఖ వైద్యులు నారగాని రాంప్రసాద్ అన్నారు. ఏనుకూరులో గత వారం రోజులుగా జరుగుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న ఏన్కూరు జట్టుకు డాక్టర్ రాంప్రసాద్ 30 వేల రూపాయలు తోపాటు ట్రోఫీని అందజేశారు. రెండో బహుమతి గెలుచుకున్న కొనిజర్ల జట్టుకు చిలుకూరి ఆనందరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చిలుకూరి అనిల్ కుమార్ 20 వేల రూపాయలు ట్రోఫీని అందజేశారు. మూడో బహుమతి గెలుచుకున్న జట్టుకు కూరాకుల లక్ష్మయ్య శేషమ్మ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కూరాకుల రమేష్ 15 వేల రూపాయలను అందజేశారు. నాలుగో బహుమతి గెలుచుకున్న జట్టుకు వక్కందుల నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు నాగార్జున్,సాగర్,అవినాష్ 12 వేల రూపాయలు అందజేశారు. ఐదో బహుమతి గెలుచుకున్న జట్టుకు శ్రీ లక్ష్మీనరసింహ ఏజెన్సీ గ్యాస్ వారు నునావత్ ప్రేమ్ కుమార్ పదివేల రూపాయలు అందజేశారు. ఆట మొత్తం లో ఉత్తమ క్రీడా ప్రదర్శన చేసిన యువకునికి ఏనుకూరు కు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు మేడ ధర్మారావు మూడువేల రూపాయల నగదును అందజేశారు. ఏనుకూరుకు చెందిన మారేపల్లి పెద్దబాబు క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ రాంప్రసాద్, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు ఇరువురు కలిసి మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్రికెట్ ఆటకు ఎక్కువ ఆధార అభిమానాలు పెరిగాయి అన్నారు. ఎక్కడ చూసినా గ్రామాల్లో యువకులంతా ఎక్కువగా క్రికెట్ ఆటకు టైం కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. యువకులంతా ఆటతో పాటు చదువుల్లో కూడా రాణించాలని కోరారు. ఆటల పోటీల్లో బహుమతులు ముఖ్యం కాదని పోటీ తత్వంతో ఆటల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన వారే నిజమైన క్రీడాకారులని తెలిపారు. ఎక్కడ ఆటలు పోటీలు జరిగినా ఐకమత్యంతో అన్నదమ్ముల్లగా ఆడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వర్ణ నరేందర్, మ్జాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, నాయకులు సూరంపల్లి రామారావు,లాలు నాయక్, బిజెపి రాష్ట్ర నాయకులు కొవ్వూరి నాగేశ్వరరావు,చందమామ నరసింహారావు,వర శంకర ప్రసాద్,మాలోతు నరసింహారావు,శెట్టిపల్లి రామారావు, మాదినేని లెనిన్, వక్కంతుల నాగార్జున, ఆది నరసింహారావు,నిమ్మల నాగేశ్వరరావు, కూరాకుల రమేష్,వారణాసి తరుణ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# కూనంనేనికే దక్కిన న్యాయ విజయం

- ◆ న్యాయస్థానంలో ప్రత్యర్థులకు భంగపాటు ◆ ర్యాలీలు నిర్వహించిన సిపిఐ, ఏఐటీయుసి కార్యకర్తలు
- ◆ పాత బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు

**ఇల్లెందు జూన్ 10 నవభూమి ప్రతినిధి:** సిపిఐ, ఏఐటియుసి ఆద్వర్యంలో మంగళవారం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పై ఉన్న హైకోర్టులో కేసు కొట్టివేసిన సందర్భంగా నాయకులు కార్యకర్తలు పాత బస్టాండ్ సెంటర్ లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె సారయ్య మాట్లాడుతూ2023 నవంబర్ మాసంలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు అపూర్వ విజయాన్ని అందిస్తే ప్రజల విశ్వాసాన్ని అపహాస్యం పాలు చేయాలని కొందరు ప్రయత్నించారు. ప్రజాభిమానం పక్షానే న్యాయం నిలబడుతుందన్న నానుడి నిజం చేస్తూ రాష్ట అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కమ్యూనిస్టు వ్యతిరేకులను భంగపాటుకు గురి చేసింది. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో కూనంనేనికి మరో విజయం దక్కింది. 2023 ఎన్నికల్లో కొత్తగూడెం నియోజక వర్గం నుంచి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన కూనంనేని సాంబశివరావుకు నియోజక వర్గ ప్రజలు పట్టం కట్టారు. కూనంనేని ప్రజాభిమానం ముందు నిలబడలేక ఎన్నికల్లో చతికిలబడిన కొందరు ఎన్నికల అఫిడవిట్లో తప్పుందని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ తర్వాత న్యాయస్థానం కూనంనేనిపై దాఖలైన పిటిషన్ ను కొట్టివేస్తూ సోమవారం తీర్పునిచ్చిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బందం నాగయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాస శ్రీనివాసరావు, బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్, టిజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుగులొత్ కృష్ణ, ఫిట్ కార్యదర్శులు నూనె శ్రీనివాస్, నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, మాషం భూషనమ్, దాట్ల వేంకటేశ్వర్లు, పి యుగేందర్ ,మంచాల వేంకటేశ్వర్లు, బొల్లేద్దుల శ్రీనివాస్, పైడి రాజు, గుడిపెల్లి భాస్కర్, ఓరం శ్రీనివాస్, ఆలేం రాఘవేంద్రరావు, దీన్ దయాల్, మసూద్ అలి,రాము, చిక్కా శ్రీనివాస్, మురహరి, గాదే పాపరావు, హుసేన్ తదితరులు పాల్గొన్నారు





# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

### ఇల్లందు ఎమ్మెల్యే కనకయ్య



**గార్ల, నవభూమి, జూన్ 10:** రైతు సంక్షేమాన్ని కాంక్షించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యుడు కోరం కనకయ్య అన్నారు. గార్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన భూ భారతి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతులకు వరమని, పెండింగ్ లో ఉన్న భూ పట్టాలను నేరుగా చేయించుకోవచ్చుననే సదుద్దేశంతో భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు తెచ్చిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో పట్టాదారు పాస్ పుస్తకాలు జరుగక పోవడం తో రైతులు ఆందోళనకు గురవుతుండటం, రైతుల పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చారని, రైతులు పూర్తి స్థాయిలో దరఖాస్తులు అందించి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందాలని సూచించారు. దీంతో రైతు బంధు, రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్యా అశోక్, గార్ల తహశీల్దార్ శారద, ఎంపిడిఓ మంగమ్మ, మండల మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి: న్యూడెమోక్రసీ డిమాండ్

### 14న హైదరాబాదులో అఖిలపక్షం మహా ధర్నాను జయప్రదం చేయండి.

### న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గౌర్రెపాటి రమేష్

**తిరుమలయపాలెం నవభూమి జూన్ 10** ఆపరేషన్ కగార్ ను తక్షణమే నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని కోరుతూ జూన్14న హైదరాబాదులో అఖిలపక్షం ఆధ్వర్యంలో జరుగు మహాధర్నాను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి గౌర్రెపాటి రమేష్ పిలుపునిచ్చారురూ ఈరోజు తిరుమలాయపాలెం మండల కేంద్రంలో న్యూడెమోక్రసీ ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ జరిగింది ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఖనిజ సంపదను బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను, మావోయిస్టును హత మారుస్తున్నారని విమర్శించారు.తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ను రద్దుచేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టుల పేరుతో ఆదివాసీ లను హతమార్చటం చాలా దుర్మార్గమని దేశానికి మూలపురుషులు ఆదివాసులుఅని వారు నివసిస్తున్న ప్రాంతాలను కాపాడాలని తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు జూన్ 14న హైదరాబాదులో అఖిలపక్షం పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు గౌర్రెపాటి వీరస్వామి,అచ్చ ఉప్పలయ్య, పేరం వెంకటేశ్వర్లు, నాగయ్య, చారి,శ్రీనివాసరెడ్డి,షబ్బీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రశ్నించే కమ్యూనిస్టులపై కక్షకట్టిన మోడి షా

- ఆపరేషన్‌కగార్ నియంతపాలనకు పరాకాష్ట
- సిపిఐ రాష్ట్రకార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని
- ఉత్సాహంగా పాల్వంచ మండల సిపిఐ మహాసభ









**పాల్వంచ టౌన్ జూన్ 10 నవభూమి ప్రతినిధి:** ప్రశ్నించే కమ్యూనిస్టుల పై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో సిపిఐ పాల్వంచ మండల 19వ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని తొలుత అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి, మహాసభ ప్రారంభ సూచీగా అరుణ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలని అన్నారు. 2026 మార్చి 31 వరకు నక్సలైట్లను అంతముందిస్తామని లక్ష్యంగా పెట్టుకునిమరి ఎన్ కౌంటర్లు చేస్తుండడం, మరోపక్క తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఎన్ కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని కోరారు. పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. తనను ఎమ్మెల్యే గా గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తలిపారు.అంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా మాట్లాడుతూ దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నంది పలికి ఆధునికతవైపు నడిపించింది ఎర్ర జెండానేనని, అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పూర్తి అవగాహన తో ప్రజాసమస్యలపై స్పందించాలని పిలుపునిచ్చారు. గుండాల నాగరాజు, నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వి. పద్మజ, ప్రజాసంఘాల నాయకులు చెన్నయ్య, వేముల కొండలరావు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, వేములపల్లి శ్రీను, మనేం వెంకన్న, శనగారపు శ్రీనివాసరావు నరహరి నాగేశ్వరరావు, వట్టి కొండ మేరమ్మ, ఎల్లంకి శివరావు, వగెల పద్మ, మేక రాంబాబు, చంచలపురి శ్రీనివాసరావు, సాయిల శ్రీను, జరుపుల మోహన్, మాలోత్ హరి, సుంకర రంగారావు, లావుడియా చందులాల్, ఎంగ్రావత్ ప్రభావతి, మద్దుల వీర మోహన్ రావు, బానోత్ విజయ్, జక్కుల లింగేశ్వర్, ఆడపు పెద్ద వెంకటరామయ్య, భూక్యా రమేష్, ఆవుల సతీష్, వనపర్ల జకరయ్య, లచ్చిరాం, చల్లా కృష్ణ, ఉంగ్రావత్ రవి, నిట్టమృత్ రావు, వజ్జ వాసు, కుంజా రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# గార్ల పెద్ద చెరువు శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయాలి

- భూ భారతి సదస్సులో ఆందోళన
- హద్దుల ఏర్పాటుకు ఎమ్మెల్యే హామీ

**గార్ల, నవభూమి, జూన్ 10:** గార్ల పెద్ద చెరువు శిఖం భూమిని కబ్జా చేసిన కబ్జా దారులపై చర్యలు తీసుకోవడం తో పాటు హద్దులు ఏర్పాటు చేయాలని గార్ల భూ భారతి సదస్సులో సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసి పార్టీల ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. గార్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం మండల రెవెన్యూ అధికారులు భూ భారతి సదస్సు ఏర్పాటు చేశారు. 766 సర్వే నెంబర్ తో పాటు 457, 440 నెంబర్లలో ఉన్న శిఖం భూమిని కొందరు ఆక్రమించుకొని తప్పుడు పట్టాలు చేయించుకొని యధేచ్ఛగా అనుభవిస్తున్నారని, వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సదస్సులో నినాదాలు చేశారు. ఇదే సమయంలో సదస్సు కు హాజరైన ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యుడు కోరం కనకయ్య స్పందించి చెరువు శిఖం భూమిని పూర్తి స్థాయిలో సర్వే జరిపి కబ్జా కాకుండా హద్దులు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. రైతు శ్రేయస్సే లక్ష్యం గా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి రైతు సంపూర్ణ సహకారాన్ని అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే కనకయ్య కు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టె బోయిన శ్రీనివాస్, న్యూ డెమోక్రసి పార్టీ జిల్లా నాయకుడు జడ సత్యనారాయణ, సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసి పార్టీ ల మండల కార్యదర్శులు అలవాల సత్యవతి, జంపాల వెంకన్న, జి. సక్రు, తదితరులు పాల్గొన్నారు.



# ఆయిల్ ఫాం సాగుపై మక్కువ చూపాలి



గార్ల, నవభూమి, జూన్ 10: మార్కెట్ లో అధిక డిమాండ్ ఉన్న పంటలపై ఆయిల్ ఫాం పై రైతులు మక్కువ చూపాలని మహబూబాబాద్ జిల్లా ఉద్యానవన జిగుగు మరియన్న రైతులకు సూచించారు. గార్ల రైతు వేదిక లో మంగళవారం జరిగిన రైతు అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడుతూ పంట మార్పిడిని ప్రతి ఏటా జరిపితే చీడపీడల బెడద నివారణతో పాటు దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆయిల్ ఫామ్ కు తన్నుకు 20వేల రూపాయల ఆదాయం లభిస్తుందని దీని ద్వారా ఎకరాకు లక్ష రూపాయల వరకు లాభం చేకూరుతుందని, రైతులు అవగాహన పెంపొందించుకొని సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి కె రామారావు, దోర్నకల్ హెచ్ ఓ శాంతి ప్రియ, ఏఈఓలు కిరణ్, రాజ్యలక్ష్మి, పూజిత, మేఘన, తదితరులు పాల్గొన్నారు.

# గంటలోనే భూభారతి గ్రామసభను ముగించిన అధికారులు



టేకులపల్లి జూన్ 10 నవభూమి ప్రతినిధి: రెవెన్యూ అధికారులు మరోమారు అమాయకులైన ఆదివాసి గిరిజన పట్ల తమ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. భూభారతి రెవెన్యూ గ్రామసభల నిర్వహణలో భాగంగా మంగళవారం టేకులపల్లి మండల లోని మారుమూల గ్రామమైన కిష్టారంలో మధ్యాహ్నం 1:30 నిమిషాల నుంచి సాయంత్రం 4:30 నిమిషాల వరకు నిర్వహించాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా అధికారులు మధ్యాహ్నం మూడు గంటలకు టాపిగా గ్రామసభ వేదిక వద్దకు చేరుకున్నారు. అధికారుల రాక కోసం గ్రామస్తులు పడే కాపులు కాస్తూ అక్కడే ఉన్నారు. 3 గంటలకు వచ్చిన అధికారులు కేవలం గంటలోపే గ్రామసభ నిర్వహించి, 4 గంటలకు ముగించి హడావుడిగా వెళ్లిపోయారని అక్కడి గ్రామస్తులు తీవ్ర ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. తమ సమస్యలు పూర్తిగా వినలేదని, అదేవిధంగా తమ నుంచి వినతి పత్రాలు కూడా సరిగా తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి తమ గ్రామం కిష్టారంలో భూభారతి రెవెన్యూ గ్రామసభ నిర్వహించాలని ఆదివాసి గిరిజనులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# యువ క్రీడాకారుడుకి ఆర్థిక సహాయం అందించిన ఐటీసీ ప్రముఖ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్

భద్రాచలం జూన్ 10 నవభూమి ప్రతినిధి: భద్రాచలం బ్రెస్ట్ క్రికెట్ అకాడమీ భద్రాచలంలో శిక్షణ పొందుతున్న ఇటీవల కాలంలో హైదరాబాదులో జరిగినటువంటి క్రికెట్ లీగ్ ఫ్రెండ్లీ మ్యాచ్లో 73 బంతుల్లో 214 పరుగులు చేసి 17 సిక్సులు 22 ఫోర్లు సాధించిన జి ప్రసన్నకుమార్ ఆర్థికంగా పేదవాడు ఈ విషయాన్ని భద్రాచలం రోటరీ క్లబ్ ఉపాధ్యక్షులు మరియు క్రికెట్ అభిమాని షేక్ అజీమ్ ప్రముఖ ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లడంతో పాకాల దుర్గాప్రసాద్ తన నివాసంలో ప్రసన్నకుమార్ కు శాలవతో సత్కరించి క్రికెట్ కిట్ కు కావాల్సిన 15000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ క్రికెట్ అకాడమీ కోచ్ శ్రావణ్ తేజ క్రీడాకారులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

టేకులపల్లి జూన్ 10 నవభూమి ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మాకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా మండల వ్యాప్తంగా ఎంపికైన 836 మంది లబ్ధిదారులకు మండల కేంద్రమైన టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య పట్టాలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపికైన ప్రతీ ఒక్క లబ్ధిదారుడు ప్రభుత్వం ఇచ్చిన నమూనా ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రజలకు, విడతల వారీగా అర్హులైన ప్రతీ ఒక్కరికి, ఇల్లు అందేవిధంగా తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముందడుగు వేస్తున్నారని అన్నారు. మొదటి విడతలో ఎంపిక కానివారు, ఎవరూ నిరాశ చెందవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికి, విడతల వారీగా ఇండ్లు మంజూరు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, 500 రూపాయలకే వంట గ్యాస్, ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలతో తోపాటు అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ లంకపల్లి వీరభద్రం, ఇంచార్జ్ ఎంపీడీవో



గాంధీ, హౌసింగ్ డిఇ, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, మార్కెట్ చైర్మన్ రాంబాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవా నాయక్, నాయకులు ఈది గణేష్, పోశాలు, ఇస్లావత్ రెడ్యానాయక్, భద్రు, శంకర్, ధర్మయ్య, లక్కినేని శ్యామ్, మధురెడ్డి, బానోత్ సరోజినీ, బొడ్డు అశోక్, ఊళ్ళోజి ఉదయ్, భూక్యా సర్దార్, బానోత్ రవి, మూడ్ గణేష్, హనుమంతు పాల్గొన్నారు.

# కావడిగుండ్లలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు







అశ్వారావుపేట టౌన్ జూన్ 10 నవభూమి: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని అశ్వారావుపేట లోని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ శిరీష, డాక్టర్ జంబమ్మ మంగళవారం అశ్వారావుపేట మండలంలోని కావడిగుండ్ల గ్రామంలోని గ్రామపంచాయతీలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ డాక్టర్ జంబమ్మ మాట్లాడుతూ సూచించిన పంటలలో సూక్ష్మ నీటి పారుదల బిందు సేద్యము పాటించి రైతు సోదరులు పంట సాగులో నీటి ఆదాను పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సూచించిన అంశాలు రైతు సోదరులందరూ వాన కాలంలో సాగు చేసేటువంటి పంటలలో పాటించటం వలన సుస్థిర వ్యవసాయం చేయవచ్చని తెలిపారు. భూసార పరీక్ష అనుసారంగా ఎరువు యాజమాన్యం చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ సిఫారసు చేసిన మేరకు యూరియాని వాడటం వల్ల ఖర్చు తగ్గించడమే కాకుండా నేలలోని సూక్ష్మజీవులను రక్షించుకోగలరని తద్వారా వాతా వరణంలో ని నత్ర జని స్థిరీకరించే అవకాశం ఉందని తెలిపారు. రైతు సోదరులు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి పంటల్లో కలియదున్ని సేంద్రీయ కర్బన శాతం పెంచాలని తెలిపారు. ఆ తర్వాత వ్యవసాయ అధికారి శివరాం ప్రసాద్ మాట్లాడుతూ రైతులు వానాకాలం పంట సాగుకు అవసరమయ్యే విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదులు భద్రపరచుకోవలని తెలియజేశారు. వ్యవసాయ శాఖ నుండి రాయితీల గురించి వివరించారు. ఉద్యాన విస్తరణ అధికారి ఈశ్వర్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ నుండి లభ్యమయ్యే రాయితీల గురించి వివరించారు. ముఖ్యంగా బిందు సేద్యం, పండ్ల సాగుకు సంబంధించిన రాయితీల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ సర్పంచ్ భూలక్ష్మి రైతులందరూ శాస్త్రవేత్తలు చెప్పినటువంటి ముఖ్యమైన సూచనలను పాటించి రాబోయే వాన కాలంలో పంట సవ్యంగా చేసుకోవాలని కోరారు. ఆ తర్వాత గ్రామపంచాయతీ సెక్రటరీ మోతిలాల్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బుజ్జి రావు వ్యవసాయ విస్తరణ అధికారి సూరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు కళ్యాణ్ గౌడ్, దీక్షిత్, నాగమల్లేశ్వరి, దివాకర్, భవ్య శ్రీ ప్రదర్శన చేసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు యొక్క ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరి సోదరీమణులు, గ్రామస్తులు, విద్యార్థులు గ్రామపంచాయతీ అధికారులు, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు:తహసిల్దార్

ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 10: రైతుల భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు తెలంగాణ ప్రభుత్వం నిర్వ హిస్తుందని రైతులు తమ భూ సమస్య లనుఈ రెవెన్యూసదస్సులో పరిష్కరించు కోవాలని తాసిల్దార్ మన్నె ఉషా శారద తెలిపారు.మంగళవారం మండల పరిధి లోనిగుంటుపల్లిగోపవరంగ్రామపంచాయతీ కార్యాలయంలో రైతుసదస్సు ఆర్ఐ రాజశేఖర్,ఏఎస్ఓ జాన్ దర్గాసాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.కాచవరం రెవెన్యూ సదస్సును గ్రామ పంచాయతీ కార్యాలయంలోఆర్ఐరవికుమార్,యుడిసి శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు .రైతులు తమ భూములకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. తాసిల్దార్ ఉషా శారద మాట్లాడుతూ ప్రభుత్వం భూసమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం తీసుకు వచ్చిందని తెలి పారు.గతంలో ధరణి చట్టంలో పరిష్కారం కానీ భూసమస్యలకుభూభారతి చట్టంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందనిఅన్నారు.సర్వేనెంబర్ తప్పు లు,భూమి హెచ్చుతగ్గులు,రికార్డులలో తప్పులనమోదువంటి పలు సమస్యలను రైతులు భూభారతి చట్టం ద్వారా పరిష్కరించుకునేందుకు వీలుకలుగుతుందని అన్నారు.రైతుల దగ్గర దరఖాస్తులు స్వీకరించి వారికి రసీదు అందిస్తున్నట్లు తెలిపారు.భూభారతి చట్టంలో రైతుల అన్ని సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. కాచవరంరైతుసదస్సులో80దరఖాస్తులు, గుంటుపల్లి గోపవరం రైతు సదస్సులో 54 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది చందు,వరలక్ష్మి, మాజీ సర్పంచులు కోట శ్రీనివాసరావు, సామినేని హనుమంతరావు,రెండు రెవెన్యూ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన పనులను చేపట్టాలి

## నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలి

## ఈజీఎస్ ఈసీ దామాల వెంకటేశ్వర్లు



**కామేపల్లి,నవభూమి,జూన్ 10 :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు లు సత్వరమే నిర్మాణ పనుల ను చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హా మీ పథకం ఈసీ దామాల వెంక టేశ్వర్లు కోరారు.కామేపల్లి మం డలం లాల్య తండా పంచాయి తీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం లబ్ధి దారులు,గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు.ఇందిరమ్మ ఇండ్ల పథకమును లబ్ధిదా రులు సద్వినియోగం చేసు కోవాలని కోరారు.ప్రభుత్వం అర్హులైన వారందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని తెలి పారు.ప్రభుత్వం కల్పిస్తున్న
అమూల్యమైన అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కా ర్యక్రమంలో పంచాయతీ కార్య దర్శి విక్రమ్, గ్రామ పెద్దలు భూక్య శ్రీరాములు, సరిత తదితరులు పాల్గొన్నారు.

# సతీష్ హత్య కేసు నిందితుడిని పట్టుకున్న పోలీసులు



**భద్రాచలం జూన్ 10 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం ఏ ఎస్ ఆర్ కాలనీ లో జరిగిన కణితి సతీష్ హత్య కేసు ను విక్రాంత్ కుమార్ సింగ్, (ఐ పీ యస్). అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, భద్రాచలం విచారణ చేపట్టి నేరస్తుల కోసం మూడు బృందాలను ఏర్పాటు చేసి నేరస్తుల కోసం వెతుకుతూ ఉండగా ప్రధాన నిందుతుడు అయిన గుంజా సాయి రామ్ సన్నాఫ్ ఏడుకొండలు. జగదీష్ కాలనీ అను అతని నిన్నటి రోజున 9 జూన్ 2025న భద్రాచలం పోలీస్ సిబ్బంది పట్టుకోవడం జరిగింది. పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చేసి భద్రాచలం ప్రధమ శ్రేణి మేజిస్ట్రేట్, భద్రాచలం ముందు హాజరు పరిచారు ఆధారపరిచారు మిగిలిన వారి కోసం . మిగిలిన వారి ఆచూకి కొరకు గాలింపు చర్యలు కొనసాగుతున్నవి. ఈ సందర్భంగా ప్రధాన నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన టౌన్ ఇన్స్పెక్టర్ యం.నాగరాజు, యస్ ఐ లు స్వప్న, సతీష్, రామకృష్ణ లు, వారి సిబ్బందిని అభినందించారు. మిగిలిన ముద్దాయిల కోసం గాలింపు చర్యలు కొనసాగుచున్నాయి. పట్టుబడినవారి వివరములు

# గురు కులాలలో నూతన మెనుపై వంట సిబ్బందికి శిక్షణ



**జులూరుపాడు,జూన్ 10 (నవభూమి ప్రతినిధి)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కస్తూరి బా గాంధీ గురుకుల విద్యాలయాలలో విద్యార్థినులకు మరింత పౌష్టికమైన ఆహారం అందించటం కోసం నూతన ఆహార మెనూ ఏర్పాటు చేసింది.దానిపై వంట సిబ్బందికి ఒక రోజు శిక్షణలో భాగంగా మంగళవారం స్థానిక కే బి జి వి విద్యాలయంలో శిక్షణా తరగతలు నిర్వహించారు. జీ ఆర్ పి ల సమక్షంలో వంట సిబ్బందికి శిక్షిన అందించారు. జీ సి ఓ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నూతన మెనూ పొందుపరచి 15 రకాల వంటలను తయారీపై శిక్షణ అందించినట్లు తెలిపారు.విద్యార్థులకు శుచి, శుభ్రత,నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం సకాలంలో అందించాలని వివరించారు. జిల్లాలో 14 కేజిబివి పాఠశాలల సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్య క్రమం లో ముఖ్య అతిధులుగా సెక్టరల్ అధికారులు పాల్గొన్నట్లు స్థానిక కేజిబివి ప్రిన్సిపాల్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు.



# మా భూములలో ఉన్న ఆక్రమణదారులను తొలగించాలి





**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 10:** మండల పరిధిలోని భీమవరం గ్రామ రెవెన్యూ పరిధిలో గల 193 సర్వే నెంబర్లో ఉన్న ఆక్రమణదారులను తొలగించి తమ భూములకు సరిహద్దులు ఏర్పాటు చేయా లని భీమవరం గ్రామ రైతులు మంగళ వారం కాచవరం గ్రామంలో జరుగుతున్న రైతుసదస్సులో తాసిల్దార్ కు ఉషాశారద కు వినతిపత్రం అందించారు. భీమవరం గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్వరరెడ్డి, శీలం భూషణ్ రెడ్డి అనే ఇద్దరు రైతుల భూముల గట్టురాళ్లను ప్రక్కన ఉన్న రైతు లు పీకివేసితమభూములకు ఫెన్సింగ్ రాళ్లు ఏర్పాటుచేశారని ఇట్టి విషయంపై విచారణచేపట్టి సర్వేచేయించి ఆ రైతులు వేసిన ఫెన్సింగ్ రాళ్ళను తొలగించి మా భూములకు హద్దులు ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని రైతులు తహసిల్దార్ ను కోరారు.భీమవరం గ్రామా నికి చెందిన తల్లపురెడ్డి సీతారామిరెడ్డి, తలపరెడ్డి వెంకటరెడ్డి,సామినేని శ్రీనివాస రావు,తలపురెడ్డి ప్రసన్నరెడ్డి,శీలం వెంకట జ్యోతి తదితరరైతులు తెలిపిన వివరాలు భీమవరంగ్రామ రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 190లో గల మా భూములకు హద్దులుఏర్పాటుచేసుకున్నగట్టు రాళ్లను పీకి మా భూములను కొందరు రైతులు దౌర్జన్యంగా కలుపుకున్నారని,రికార్డుల ప్రకారము సర్వేచేసి గట్లు రాళు ఏర్పాటు కొరకురెండు పర్యాయాలుమండల ప్రజా వాణిలో దరఖాస్తులు సమర్పించినా అధి కారులు పట్టించు కోలేదని భూములు ఆక్రమణకుగురైనరైతులుతమఆవేదనను వెల్లబుచ్చారు.ఎఫ్లైన్ ద్వారా సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నామని అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వపాఠశాలకుచెందినపెన్సింగ్ రాళ్ళ ను తీసుకొనివచ్చి మాభూములకు అడ్డు గా ఏర్పాటుచేశారనితెలిపారు.మండల అధికారులు పట్టించుకోకపోవడంతో ఖమ్మం ప్రజావాణిలో కలెక్టర్ కార్యాలయం లో కూడా దరఖాస్తు సమర్పించామని, దీనిపై స్పందించిన కలెక్టర్ ఖమ్మం ఏడిని సర్వే చేయమని ఆదేశించారని తెలిపారు. ఖమ్మంఏడి ఎర్రుపాలెంమండల సర్వేయర్ ని ఫోన్ ద్వారా190 సర్వే నెంబర్లులో గల భూమిని సర్వే చేయమని ఆదేశించినా సర్వే చేయలేదన్నారు.ఇట్టి విషయంపై విచారణ చేపట్టి సర్వే చేయించి ఆక్రమణ దారులు ఏర్పాటుచేసిన పెన్సింగ్ రాళ్ళను తొలగించి తమకు న్యాయం చేయాలని, మా భూములకు పెన్సింగ్ ఏర్పాటు చేసిన వ్యక్తులపైచట్టపరమైనచర్యలచేపట్టాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో రైతు లు సీతారాంరెడ్డి,వెంకటరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, టి పుల్లారెడ్డి,వెంకటజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## చట్టం ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి

# చిత్తశుద్ధితో కృషి

◆ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ◆ లైసెన్స్ సర్వేయర్ ద్వారా సమస్యల పరిష్కారం వేగవంతం



**చింతకాని, నవభూమి, జూన్ 10:** నూతన చట్టం భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం చింతకాని మండలం వందనం గ్రామ, గ్రామ పంచాయతీ భవనం ఆవరణలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రెవెన్యూ సదస్సులో నిర్వహిస్తున్న రిజిస్టర్ల ను పరిశీలించి ఎటువంటి భూ సమస్యలు అధికంగా వస్తున్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామా కేసులను హై కోర్టు నుంచి అనుమతి రాగానే నిబంధనల ప్రకారం కబ్జాలో ఎవరు ఉన్నారో విచారించి, అర్హుల పేరిట పట్టాలు అందిస్తామని తెలియ జేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆర్.ఎస్.ఆర్. సమస్యలను విస్తీర్ణం ఉంటే సర్వే చేసి పరిష్కరించాల్సి ఉంటుందని, భూ భారతి చట్టం ప్రకారం రెవెన్యూ సదస్సుల్లో అందించే భూ హక్కుల పట్ల ఏదైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ కోర్టుల్లో ఉచితంగా అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉందని కలెక్టర్ దరఖాస్తుదారులకు తెలిపారు. ప్రతి భూ సమస్యకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని దరఖాస్తుదారులకు భరోసా కల్పించాలని అన్నారు. అసైన్మెంట్ భూముల కొనుగోలు చేసింది పేదలు ఉంటే పట్టాలు జారీ చేస్తామని, లేని పక్షంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అన్నారు. ప్రభుత్వం త్వరలో అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి పేదలకు భూముల పంపిణీకి సిద్ధపడుతోందని అన్నారు. భూములకు దారి సమస్య ఉందని ఒక దరఖాస్తుదారుడు కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా, రెవెన్యూ కోర్టులో ఆర్డర్ పాస్ చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన సర్వే వేగవంతంగా చేసేందుకు ప్రైవేటు సర్వేయర్లకు శిక్షణ అందించి లైసెన్స్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు, ప్రస్తుతం సర్వేయర్లకు శిక్షణ అందిస్తున్నామని, త్వరలోనే వీరికి లైసెన్సులు అందించి సర్వే చేస్తామని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఒక గ్రంథాలయం ఏర్పాటు చేసి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నామని, మండలాల్లో ఏర్పాటు చేసిన తర్వాత పెద్ద గ్రామాల్లో కూడా గ్రంథాలయాలు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రెగ్యులర్ గా వచ్చి సలహాలు సూచనలు ఇస్తున్నారా, ఏం పంటలు సాగు చేస్తున్నారు వంటి వివరాలు రైతుల దగ్గర నుంచి కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వసతులు, నాణ్యమైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, ఒక సంవత్సరం పిల్లలను ప్రభుత్వ బడులకు పంపి, పిల్లలలో వచ్చే మంచి మార్పులను గమనించాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట చింతకాని మండల తహసిల్దార్ కే. అనంత రాజు, పంచాయతీ కార్యదర్శి కే. శ్రీనివాస్, రైతులు, గ్రామస్తులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



# డాక్టర్ మద్దిశెట్టి దంపతులను అభినందించిన బాబుమోహన్

## భారత నోబుల్ ప్రతిభా అవార్డు పొందిన డాక్టర్ మద్దిశెట్టి నారీశక్తి 2025 అవార్డ్‌తో మద్దిశెట్టి పద్మకు సన్మానం







**జూలురుపాడు, జూన్ 10 (నవ భూమి ప్రతినిధి)** తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జి సి ఎస్ వల్లూరి ఫౌండేషన్ సహకారంతో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా ఘనమైన కీర్తిని సొంతం చేసుకున్న దంపతుల భవ్య చరిత. మండల పరిధిలోని పాపకొల్లు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానఉపాధ్యాయులు,మండల విద్యాశాఖాధికారి అంతర్జాతీయ,జాతీయ,రాష్ట్ర స్థాయిలో పలు పురస్కారాలు పొందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,స్వర్ణ నంది,గండ పెండేరాలు, ముంజేతి కంకణాలు పొంది రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరావు దంపతులను ఆదివారం ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డులతో ఘనంగా సన్మానించి అభినందించారు. హైదరాబాద్ లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ప్రముఖ సినీ హాస్య నటుడు,ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రివర్యులు డాక్టర్ బాబు మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరావుకు భారత్ ప్రతిభ నోబుల్ అవార్డు,ఆయన సతీమణి మద్దిశెట్టి పద్మకు నారీశక్తి 2025 అవార్డులు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా బాబు మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా మద్దిశెట్టి అమూల్యమైన సేవల ద్వారా ఎంతోమంది విద్యార్థులు తమ జీవితాలలో ఉన్నత స్థాయికి ఎదగడానికి నిచ్చెన మెట్ల మాదిరిగా చేయూత నివ్వడం అభినందనీయం అని ప్రస్తుతించారు.గురువు జీవితం అత్యున్నతమైనదని అన్నారు. డాక్టర్ మద్దిశెట్టి జీవితంలో సగ భాగమైన పద్మ ఆయన విజయాలలో సైతం పాలుపంచుకొని కీర్తి గడించారని అభినందించారు. భవిష్యత్ లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు సముద్రాల వేణుగోపాలచారి, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ శ్రీ లతా రెడ్డి,మల్కాజిగిరి డిజిపి వెంకటరమణ,ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ,సినీ రంగ ప్రముఖులు దొరస్వామిరాజు, ఫౌండేషన్ అధ్యక్షురాలు కృష్ణవేణి,ప్రముఖ వ్యాఖ్యాత శ్రీధరాచార్యులు,సిజిఎస్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువకుని బలవన్మరణం



**జూలురుపాడు, జూన్ 10 (నవభూమి ప్రతినిధి)** బ్రతుకు తెరువు నిమిత్తం మండలానికి వచ్చిన ఇతర రాష్ట్రానికి చెందిన యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నీరజ్ రఘు వంశీ (21) భార్యా ఆల్పా రఘువంశీ తో కలిసి బ్రతుకు తెరువు నిమిత్తం గత పది రోజుల క్రితం పడమట నర్సాపురం గ్రామానికి వచ్చారు.అదే గ్రామానికి చెందిన చలపతిరావు పామాయిల్ తోటలో కూలి పనులు చేసుకుంటున్నారు.సోమవారం రాత్రి నీరజ్ అతిగా మద్యం సేవించి ఇంటికి రాగా,ఎందుకు ఇంతగా మద్యం తాగావు అని భార్య అల్పా మృతుడిని మందలించింది. ఇద్దరూ గొడవ పడ్డారు.కోపంతో భార్య ఇల్లు విడచి బయటకు వెళ్లగా మనస్థాపం చెందిన నీరజ్ ఇంట్లో ఎవరు లేని సమయం చూసి చీరతో ఫ్యాన్ కు ఉరివేసుకొని మరణించాడు.మంగళ వారం ఉదయం ఇంటికి వచ్చిన భార్య ఈ దృశ్యాన్ని చూసి చుట్టుపక్కల వారికి తెలియజేసి వారి సాయంతో మృతదేహాన్ని కిందికి దింపినది.మద్యం మత్తులో మనస్థాపానికి గురైన తన భర్త నీరజ్ బలవన్మరణానికి పాల్పడ్డాడని తన భర్త మృతి పై ఎలాంటి అనుమానం లేదని మృతుడి భార్య ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు తెలిపారు.

## అక్రమంగా విత్తనాలు

# అమ్ముతున్న వ్యక్తుల అరెస్ట్

- ప్రభుత్వ అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు
- విలేఖరుల సమావేశంలో డి ఎస్ పి అబ్దుల్ రెహమాన్



**జూలురుపాడు, జూన్ 10 (నవభూమి ప్రతినిధి)** ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రామాలలో లూజ్ విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డి ఎస్ పి షేక్ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు.అనంతారం గ్రామంలో అనుమతిలేని విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడిన కేసులో వివరాలు వెల్లడించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మిర్చి విత్తనాలను రైతులకు అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు స్థానిక మండల వ్యవసాయ అధికారి పోలీస్ సిబ్బంది సహకారంతో బృందంగా ఏర్పడి తనిఖీ నిర్వహించగా పాలెపు శివ కృష్ణ ఇంటి వద్ద ఇద్దరు వ్యక్తులు మిర్చి విత్తనాల ప్యాకెట్ లతో పట్టుబడ్డారు. సాక్షుల సమక్షంలో సోదా చేయగా కల్లూరు మండలం పెద్ద కొరుకొండి గ్రామానికి చెందిన నున్నా మహేష్, ఏనుకూరు మండలము జన్నారం గ్రామానికి చెందిన పల్లపు తిరుపతిరావు అనే వ్యక్తుల వద్ద 115 ప్యాకెట్ ల ప్రజ్వల్ సీడ్స్ కంపెనీకి చెందిన కావ్య సీడ్స్ మిరప విత్తనాలు లక్షరూపాయలు పై చిలుకు విలువ కలిగిన వాటిని స్వాదీనం చేసుకున్నారు.వారి వద్ద నుంచి టి జి 04 ఏ 0158 హ్యుండాయ్ క్రెట్టా కారు,13,000 రూపాయల నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకున్నారు. వారిద్దరి పై విత్తన నియంత్రణ చట్టం 1983 ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటించారు.గ్రామాలలో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు రైతులను ఏజెంట్ లు మార్చుకొని నకిలీ,అనుమతి లేని విత్తనాలను అంటగడుతున్నారని,రైతులు కేవలం అధీకృత డీలర్ ల వద్ద మాత్రమే కొనుగోలు చేసి రసీదులు పొందాలని విజ్ఞప్తి చేశారు. జూలూరుపాడు, సుజాత నగర్,చంద్రుగొండ,అన్నపురెడ్డిపల్లి మండలాలలో దళారులు తక్కువ రేటుకు కోనుగోలు చేసి ఎక్కువ రేటుకు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారు. విత్తన అక్రమార్కుల పై గట్టి నిఘా పెట్టినట్లు తెలిపారు.వ్యవసాయ పోలీస్ అధికారుల టాస్క్ ఫోర్స్ బృందం నిరంతర తనిఖీలు నిర్వహిస్తారని వెల్లడించారు. నిందితుల ను పట్టుకున్న అధికారులు ఏ ఓ దీపక్ ఆనంద్,ఏ ఈ ఓ, ప్రసాద్, పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వెంకటరత్నం, కానిస్టేబుల్ వెంకటేశ్వర రావు లను అభినందించారు.జిల్లా వ్యవసాయాధికారి బాబు రావు మాట్లాడుతూ పట్టుబడిన విత్తనాలను ల్యాబ్ కు పంపి నాణ్యత నిర్ధారించనున్నట్లు తెలిపారు. విత్తన ఎరువుల వ్యాపారులు విధిగా రికార్డులు నిర్వహించాలని రశీదు పై అన్ని వివరాలు పొందుపరచాలని చెప్పారు.షాపులలో స్టాక్ బోర్డ్ ప్రదర్శించాలని అవకతవకలకు పాల్పడిన డీలర్ ల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.ఈ సమావేశంలో సి ఐ ఇంద్ర సేనా రెడ్డి, ఎస్సై రవి, ఏ ఓ దీపక్ ఆనంద్ పాల్గొన్నారు.

# ఆదాయ పెంపు మార్గాలను మహిళలు అన్వేషించాలి

**చింతకాని, నవభూమి, జూన్ 10:** ఆదాయ పెంపు మార్గాలను మహిళలు అన్వేషించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం చింతకాని మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్త్రీ టీ స్టాల్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్త్రీ టీ స్టాల్ షాపు ను పరిశీలించి వ్యాపారం ఎలా నడుస్తుంది, ఆర్థికంగా లాభాలు ఉన్నయా అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్త్రీ టీ షాప్ దగ్గర కాఫీ త్రాగి డబ్బులను ఫోన్ పే ద్వారా కలెక్టర్ చెల్లించారు. వ్యాపారం ఎదుగుదలకు వినూత్న పద్ధతులు ఆలోచించుకోవాలని కలెక్టర్ సూచించారు. సిటిజన్ సర్వీసెస్ పై శిక్షణ తీసుకొని షీ రాక్స్ సెంటర్ కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. సీజన్ కు అనుగుణంగా స్నాక్స్ అందుబాటులో పెట్టి విక్రయించాలని అన్నారు. వ్యాపారం విస్తరించేందుకు అవసరమైన సహాయ, సహకారాలు ప్రభుత్వం తరపు నుండి పూర్తి స్థాయిలో అందిస్తామని అన్నారు.మహిళా సంఘాల గ్రేడింగ్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేస్తే ఎలా నడుస్తుందో పరిశీలించాలని అన్నారు. చింతకాని మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనం నిర్మాణ పెండింగ్ పనులకు 5 లక్షలు అవుతుందని కోరగా జిల్లా కలెక్టర్ వెంటనే 5 లక్షల చెక్ ను ఎంపీడీవోకు అందిస్తూ నెల రోజుల లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చింతకాని స్త్రీ శక్తి భవనంలో ముందస్తుగా కనీస అవసరాలతో భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. మహిళలు రెగ్యులర్ గా సమావేశం అవుతూ చర్చలు జరిపి ఆదాయ సంపాదన మార్గాలు అన్వేషించాలని, మహిళా మార్ట్, షి రాక్స్ సెంటర్, స్త్రీ టీ స్టాల్ మహిళల నుంచి వచ్చిన ఆలోచనల ప్రకారం ఏర్పాటు చేశామని అన్నారు. మహిళా మార్ట్ లో ఎటువంటి పదార్ధాలు విక్రయించాలో జిల్లా మహిళా సమాఖ్యలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్పులు తీసుకుని వచ్చామని, తనకు ఒక సంవత్సరం గడువు ఇచ్చి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం ఎలా అందుతుందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సమయంలో అనవసరంగా సిజేరియన్ ఆపరేషన్ లు జరుగుతున్నా యని, మహిళా సమాఖ్య సమావేశాల్లో ఇటువంటి అంశాలను చర్చించి సాధారణ ప్రసవాల వల్ల కలిగే లాభాలు వివరించాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఏక రూప దుస్తుల కుట్టు డబ్బులు చివరి మహిళకు అందించాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట చింతకాని మండల తహసీల్దారు అనంతరాజు, ఎంపిడిఓ శ్రీనివాస్ రావు, ఏపిఎం శ్రీనివాస్ రావు, స్త్రీ టీ షాప్ నిర్వాహకురాలు కె. భవాని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





